నేటి దినపత్రిక
సూర్య
17 వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
శనివారం | 20 జులై 2024 | పేజీలు 8

# మంత్రి లోకేష్ సారథ్యంలో విద్యారంగానికి పెద్దపీట

- కోవూరు, కొత్తవంగల్లు స్కూల్స్‌లో విద్యా కిట్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి
- వీపీఆర్ ట్రస్ట్ సహకారంతో కోవూరు బాలికల హాస్టల్‌కు ఇన్వర్టర్, ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ ఏర్పాటు



మంత్రి నారా లోకేష్ సారథ్యంలో ప్రభుత్వ పాఠశాలలు ఉన్నత విద్యా ప్రమాణాలకు నిలయాలు కానున్నాయని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. కోవూరు బాలికల పాఠశాల, కొడవలూరు మండలం కొత్త వంగల్లు హై స్కూల్స్ లో జరిగిన విద్యా కిట్ల పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

వివరాలు 6లో

## నెల్లూరు బారాషహీద్ దర్గా అభివృద్ధికి

# రూ.5 కోట్లు మంజూరు చేసిన సీఎం చంద్రబాబు



- రొట్టెల పండుగకు వచ్చిన వారితో జూమ్‌లో మాట్లాడిన ముఖ్యమంత్రి
- రాష్ట్రానికి మంచి జరిగేలా ప్రార్థించాలని భక్తులను కోరిన సీఎం

నెల్లూరు, మేజర్‌న్యూస్ :
అత్యంత భక్తి శ్రద్ధలతో జరిగే నెల్లూరు రొట్టెల పండుగ కార్యక్రమాన్ని రానున్న రోజుల్లో మరింత విస్తృతంగా, వైభవంగా నిర్వహిస్తామని సీఎం చంద్రబాబు అన్నారు. రొట్టెల పండుగ నిర్వహించే బారా షహీద్ దర్గాలో ప్రార్థనల నిర్మాణాలకు రూ. 5 కోట్లు మంజూరు చేసిస్తున్నట్లు ప్రకటించారు. ఈ పండుగలో పాల్గొనే భక్తులకు సీఎం శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు ఆన్‌లైన్ విధానం ద్వారా రొట్టెల పండుగకు వచ్చిన భక్తులు, స్థానిక నేతలు, ప్రజా ప్రతినిధులతో సీఎం మాట్లాడారు. వందల ఏళ్లుగా ఒక పవిత్రమైన ప్రాంతంగా బారాషహీద్ దర్గా ఉందన్నారు. ఇక్కడ రొట్టెలు మార్చుకోవడం ద్వారా తమ కోరికలు నెరవేరుతాయని, కష్టాలు తీరుతాయని భక్తులు నమ్ముతారన్నారు. ఈ క్షేత్రానికి ఉన్న పవిత్రత, శక్తి కారణంగా ఏడాదికి 10 నుంచి 15 లక్షల మంది రొట్టెల పండుగకు వస్తారన్నారు.



కేవలం ముస్లిం సోదరులే కాకుండా.. హిందువులు కూడా రొట్టెలు మార్చుకుని తమ కోరికలు నెరవేర్చుకుంటారన్నారు. దేవుడిపై నమ్మకంతో ప్రపంచం నడుస్తుందని, ఆ నమ్మకాలను, ఆచారాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. రాకెట్ -మిగతా 2లో

## సంతానలక్ష్మీ ఆలయంలో

# ప్రత్యేక పూజలు



ఉదయగిరి, మేజర్‌న్యూస్ :
స్థానిక బీసీ కాలనీ సమీపంలో వెలసిన సంతాన లక్ష్మీ ఆలయంలో భక్తులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాడమాసం రెండో శుక్రవారం సందర్భంగా అమ్మవారు విశేష కుంకుమ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు లోకా వెంకటప్రసాద్ శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి తమ మొక్కులు తీర్చుకొన్నారు.

# దర్గా వద్ద భక్తుల రద్దీ



అనుమసముద్రంపేట మేజర్ న్యూస్ :
రొట్టెల పండుగ సందర్భంగా మండల కేంద్రమైన ఏఎస్ పేటలోని శ్రీ హజరత్ ఖాజా నాయబ్ రసూల్ వారి దర్గాలో శుక్రవారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. వర్షం కురుస్తున్నప్పటికీ యాత్రికులను వర్షంలోనే దర్గా లోపలకి వెళ్లి దర్శనం చేసుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

## మర్రిపాడులో.. దొంగలు

# హల్‌చల్

పోలీసులకు సవాల్‌గా మారిన చోరీలు

మర్రిపాడు, మేజర్‌న్యూస్ :
జిల్లా కేంద్రానికి 80 కిలోమీటర్ల దూరంలో ఉన్న మర్రిపాడు మండలంలో గత మూడు రోజుల నుంచి దొంగల హల్‌చల్ కొనసాగుతోంది. మండల పరిధిలోని పలు గ్రామాల్లో రాత్రి అనకా పగలనకా చోరీలు జరుగుతున్నాయి. ఈ దోపిడీలు పోలీసులకు సవాలుగా మారింది. గత మూడు రోజుల క్రితం పేదలపాడు గ్రామంలో దొంగలు తిరుగుతున్నారని సమాచారంతో గ్రామస్తులు భయాందోళన చెందారు. అదే తరుణంలో రెండు రోజుల క్రితం మండల పరిధిలోని పొంగూరు కండ్రిక గ్రామంలో రెండు గేదెలతో పాటు విలువైన దస్త్రాలు, వెండి, నగదు, బంగారు అపహరణకు గురయ్యాయి. ఈ నేపథ్యంలోనే మండల పరిధిలోని డీసీపల్లి గ్రామంలో 20 పందులు చోరీకి గురయ్యాయి. అంతేకాకుండా గత పది రోజుల క్రితం సోలార్‌కు సంబంధించి స్టార్టర్లు కూడా గురైన విషయం విదితమే. ఇలా మర్రిపాడు మండలంలో వరుస చోరీలతో మండల ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. సంబంధిత పోలీసులు సరిగా గస్తీలు నిర్వహించకపోవడంతోనే ఈ పరిస్థితి వచ్చిందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో రెండు ప్రధాన జాతీయ రహదారులు ఉండడంతో ఎక్కువ వాహనాలు ద్వారా పక్క పట్టణాల నుంచి ఈ దొంగలు వచ్చే దానికి ఎక్కువగా ఆస్కారం కనిపిస్తుంది. దీనికితోడు జాతీయ రహదారులపై టీ-అంగళ్లు, కూల్‌డ్రింక్ షాపులు ఉండటంచేత ఆ షాపులు వద్దకు వచ్చి పక్కా సమాచారం మిగతా 2లో



## ప్రభుత్వ భూముల్లో అక్రమ లేఅవుట్ వేస్తే

# చర్యలు తప్పవు

తహశీల్దార్ శివకృష్ణయ్య



2 లో

## పెద్దబ్బీపురంలో ఆక్రమణలు

# తొలగింపు



ఏఎస్‌పేట మండలం పెద్దబీపురం గ్రామ సమీపంలో అక్రమంగా నిర్మిస్తున్న ఆక్రమణలను తహసిల్దార్ రవికుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం తొలగించారు.

లోపల పేజీలో

# పిచ్చికుక్క దాడి - యువకుడికి గాయాలు

## గ్రామంలో శునకాల స్వైర విహారం

## భయాందోళనలో సోమశిల గ్రామస్తులు

అనంతసాగరం, మేజర్‌న్యూస్ :
అనంతసాగరం మండలం సోమశిల గ్రామంలో పిచ్చికుక్కల స్వైర విహారం గ్రామస్తులకు వణుకు పుట్టిస్తోంది. శుక్రవారం ఉదయం ఓ పిచ్చికుక్క యువకుడిపై దాడి చేసి కాలిని గాయపరిచింది. బస్టాండుకు వెళుతున్న సమయంలో నవీన్ అనే యువకుడిపై ఒక్కసారిగా -మిగతా 2లో



# దొంగ అరెస్ట్

## రైల్లో బ్యాగ్ దొంగతనాలకు పాల్పడే

### రూ.3.81 లక్షల సొత్తు స్వాధీనం
### రైల్వే డీఎస్పీ విజయ భాస్కరరావు



**నెల్లూరు క్రైం, మేజర్‌న్యూస్ :** రైల్లో దొంగతనాలకు పాల్పడే దొంగను అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి రూ.3.81 లక్షలు విలువ చేసే సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు నెల్లూరు రైల్వే డీఎస్పీ విజయభాస్కరరావు తెలిపారు. శుక్రవారం రైల్వే డిఎస్పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన దొంగతనాలకు సంబంధించి వివరాలను వెల్లడించారు. ఇటీవల చీరాల పోలీస్ స్టేషన్ పరిధిలోని రైల్లో ఎక్కువగా బ్యాగు దొంగతనాలు జరుగుతుండడంతో తమ సిబ్బంది నిఘా ఉంచడం జరిగిందన్నారు. ఈ క్రమంలో చీరాల జీఆర్‌పీ సీఐ భుజంగరావు, ఎస్సై కొండయ్య ఆధ్వర్యంలో రైల్లో తనిఖీలను ముమ్మరం చేయడం జరిగిందన్నారు. బాపట్ల జిల్లా చీరాల మండలం వాడరేవు గ్రామానికి చెందిన పెదాల వెంకటేశ్వర్లు అలియాస్ వెంకీ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా దొంగగా తేలడం జరిగిందన్నారు. అతను వద్ద నుంచి మూడు లక్షల 81 వేల విలువ చేసే 62 గ్రాముల బంగారం, సెల్‌ఫోన్లు, కంప్యూటర్లు, వాచ్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. రైల్లో ప్రయాణించే ప్రయాణికులు దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ సూచించారు. ఎవరి మీద అయినా అనుమానం ఉంటే తక్షణ జీఆర్‌పీ పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. దొంగను చాకచక్యంగా అరెస్ట్ చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకోవడంలో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో సీఐ భుజంగరావు, ఎస్సై కొండయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## పిచ్చికుక్క దాడి - యువకుడికి గాయాలు

(మొదటి పేజీ తరువాయి)



కుక్క దాడి చేసింది. కాలికి రక్తపు గాయాలయ్యాయి. దీంతో తల్లిదండ్రులు ఆ యువకుడిని స్థానిక ప్రజా వైద్యశాలకు తీసుకువెళ్లి ప్రథమ చికిత్స చేసి యాంటీబయాటిక్ ఇంజక్షన్ వేయించారు. గ్రామంలో మరి కొన్ని కుక్కలకు పిచ్చి పట్టి ఉంటున్న నేపథ్యంలో సర్వత్రా భయాందోళనలు కొనసాగుతున్నాయి. పాఠశాలలకు తమ పిల్లలను పంపించేందుకు వెనుకాడాల్సిన దుస్థితి ఏర్పడిందని తల్లిదండ్రులు వాపోతున్నారు. పంచాయతీ అధికారులు ఈ సమస్యపై దృష్టి సారించి తగు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

## మర్రిపాడులో దొంగల హల్‌చల్

(మొదటి పేజీ తరువాయి)

అందుకొని ఈ చోరీలకు పాల్పడుతున్నారనేది పలువురు చర్చించుకుంటున్నారు. అలా లేనిపక్షంలో మండలంలో ఎవరైనా ఆకతాయిలు ఈ పని చేస్తున్నారనేది కూడా చర్చ కొనసాగుతోంది. ఏదేమైనా సంబంధిత పోలీస్ అధికారులు మరో చోరీ జరగక ముందే తగు చర్యలు తీసుకోవాల్సిందిగా పలువురు కోరుతున్నారు.

## మత్స్యకారులకు సంక్రాంతి కానుక

### జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ప్రారంభం - ఎమ్మెల్యే కావ్య వెల్లడి



**కావలి, మేజర్‌న్యూస్ :** మత్స్యకారుల సమస్యలన్నిటిని సకాలంలో పరిష్కరిస్తానని కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం కావలి ఎమ్మెల్యే కార్యాలయానికి భారీగా మత్స్యకారులు విచ్చేసి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంక్రాంతిలోపు జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ప్రారంభం అవుతుందన్నారు. హార్బర్ ప్రారంభంతోపాటు మత్స్యకారులకు బోట్లు కూడా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. దూరప్రాంతాలకు వెళ్ళవలసిన అవసరం లేకుండా ఇక్కడే ఇకపై ఉపాధి లభిస్తుందన్నారు. తమిళనాడు జాలర్లు మన ప్రాంతానికి వచ్చి, మన సంపదను దోచుకుపోతున్నా అధికారులు స్పందించడం లేదన్నారు. అధికారులను కలిసి సమస్యలు తెలుపుదామని, మన మత్స్య సంపద దోచుకెళ్లకుండా చూడాలని కోరుదామని అన్నారు. కార్యక్రమంలో ఫిషరీస్ ఏడి శ్రీనివాసులు, కావలి రూరల్ సిఐ శ్రీనివా సరావు, కావలి రూరల్ మండల టీడీపీ అధ్యక్షులు ఆవుల రామకృష్ణ, మత్స్యకార కాపులు, మత్స్యకారులు తదితరులు పాల్గొన్నారు.

## రేపు గురుపౌర్ణమి వేడుకలు

**ఉయగిరి, మేజర్‌న్యూస్ :** నగరంలోని బీసీ కాలనీ సమీపంలో వెలసిన శ్రీగణేష దత్తసాయి మందిరంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గురుపౌర్ణమి సందర్భంగా స్వామివారికి కాగడ హారతి, పంచామృతాభిషేకం, నిత్యపూజలు, శాంతి హెూమాలు, మధ్యాహ్న హారతి, సంధ్యా హారతితోపాటు ప్రత్యేక పుష్పాలంకరణలో సాయిబాబా పల్లకి సేవ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం అన్నదాన, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కావున భక్తులు అధికసంఖ్యలో పాల్గొని బాబాకృపకు పాత్రులవ్వాలని వారు కోరారు.

## అక్రమ లేఅవుట్‌లు వేస్తే చర్యలు తప్పవు : తహసిల్దార్ శివకృష్ణయ్య



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోనే తోడేరు పంచాయతీ పరిధిలోని కాకాణి రమణారెడ్డి గార్డెన్స్ లో రోడ్ల భవనాలు శాఖ వారి స్థలాలు ఆక్రమించి లేఅవుట్‌లు వేయడంతో అధికారులు కాకాణి రమణారెడ్డి గార్డెన్స్ లో బోర్డులు,ఆర్చిలు, హద్దు రాళ్లు తొలగించారు.తహసీల్దార్ శివకృష్ణయ్య మాట్లాడుతూ.. నెల్లూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ అధికారులు ఆదేశాల మేరకు అక్రమణులు తొలగించమన్నారు.కాకాణి రమణారెడ్డి గార్డెన్స్ లో సుమారు 50 అంకణాలు స్థలాన్ని కబ్జా చేసారని ఆ స్థలాన్ని ఆర్ అండ్ బి వారికి స్వాధీనం చేశామన్నారు.

## వైభవంగా రొట్టెల పండుగ వేడుకలు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి పెద్ద చెరువులో శుక్రవారం రొట్టెల పండుగను భక్తులు వైభవంగా నిర్వహించారు. జోరు వర్షంలో సైతం పట్టణంతోపాటు మండలంలోని దాసరిపల్లి, మాసాయిపేట తదితర గ్రామాలకు చెందిన హిందూ ముస్లిం భక్తులు అధికసంఖ్యలో పాల్గొని రొట్టెలు మార్చుకున్నారు. ప్రధానంగా వివాహం, ఉద్యోగం, ఆరోగ్యం రొట్టెలకు గిరాకీ ఏర్పడింది. అనంతరం పత్తర్ బర్ దర్గాలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు ఏలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

## ఘాట్ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** అసంపూర్తిగా ఉన్న ఉదయగిరి–బండగానిపల్లి ఘాట్ రోడ్డు నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని ఘాట్ రోడ్డు సాధన సమితి, సీపీఎంల ఆధ్వర్యంలో శుక్రవారం పలు గ్రామాల ప్రజలు బండగానిపల్లి గ్రామంలో నినాదాలతో కూడిన ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకులు కాకు వెంకటయ్య మాట్లాడుతూ.. ఆటవీ అనుమతులు లేని కారణంగా 3.2 కిలోమీటర్ల మేర ఘాట్రోడ్డు నిర్మాణం నిలిచిపోవడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దశాబ్దాల తరబడి సుమారు పది గ్రామాల్లోని 16 వేల మంది జనాభా రాకపోకలు సాగించే ఘాట్ రోడ్డు అధ్వాన్నంగా ఉన్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్డు కోతకు గురై వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయన్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి వెంటనే ఘాట్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని, లేదంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు షేక్ నాయబ్, బేరి తిరుపాలురెడ్డి, పలు గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు బారాషహీద్ దర్గా అభివృద్ధికి రూ.5 కోట్లు మంజూరు చేసిన సీఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)



ప్రయోగాలు చేసే శాస్త్ర వేత్తలు కూడా ముందు రోజు వెళ్లి దేవుడికి దండం పెట్టుకుని తమ ప్రయత్నం విజయవంతం అయ్యేలా చూడాలని కోరుకుంటారని.. అదే నమ్మకమని పేర్కొన్నారు. ఈ కారణంగానే లక్షల మంది ఎంతో నమ్మకంగా జరుపుకునే రొట్టెల పండుగను 2014లో రాష్ట్ర పండుగగా ప్రకటించామని గుర్తు చేశారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో దర్గాను, స్వర్ణాల చెరువును అభివృద్ధి చేశామని చెప్పారు. ప్రస్తుతం ప్రార్థనా మందిరం నిర్మాణం నిలిచిపోయిందని మంత్రి నారాయణ సీఎం దృష్టికి తీసుకురాగా.. దాని కోసం రూ.5 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. రాష్ట్రానికి మంచి జరిగేలా ప్రార్థించాలని రొట్టెల పండుగకు వచ్చిన భక్తులను సీఎం కోరారు. ప్రస్తుతం రాష్ట్రం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉందని, దీని నుంచి బయటపడి సంపద సృష్టి జరగాలని సీఎం అన్నారు. సంపద సృష్టి జరిగితే.. మళ్లీ ఆ ఫలాలు పేదలకు సంక్షేమం ద్వారా పంచవచ్చున్నారు. ఖజానా నిండేలా దేవుడిని ప్రార్థిస్తూ రొట్టెలు మార్చుకోవాలని నేతలను సీఎం కోరారు. ప్రభుత్వ ఆదాయం పెరిగితే తిరిగి దాన్ని ప్రజలపైనే ఖర్చు పెడతామని చెప్పారు. రొట్టెల పండుగను రానున్న రోజుల్లో మరింత పెద్ద పండుగగా, ఘనంగా చేసుకుందామని భక్తులతో అన్నారు. విజయవాడ నుంచి వచ్చిన ఇద్దరు మహిళలతో మాట్లాడి వారి అనుభవాలు తెలుసుకున్నారు. తమ కోరికలు తీరడంతో తాము రొట్టెలు మార్చుకొవడానికి వచ్చామని ఆ మహిళలు చెప్పారు. భక్తుల కోసం మెరుగైన సౌకర్యాలు కల్పించాలని అధికారులకు, మంత్రులకు సీఎం సూచించారు.

# సిమెంటురోడ్లు నిర్మాణం - సైడుకాలువలు శూన్యం



సైడుకాలువలేక నిల్వచేరిన బురదనీరు, అడుగుపెట్టలేని విధంగా రోడ్డు



స్వంతంగా ఏర్పాటు చేసుకున్న సైడుకాలువలో నీటినిల్వలు



సైడుకాలువలో నీరు వెలుపలికి వెళ్ళే మార్గంలేని దృశ్యం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** స్వచ్ఛత.. పరిశుభ్రత.. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత.. స్వచ్ఛభారత్.. మన ఊరు–మనపరిశుభ్రత.. తదితర అనేకానేక కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతున్నా, ప్రభుత్వం ప్రజల కనీసవసతుల కల్పనకు వివిద రకాలుగా నిధులు వెచ్చిస్తున్నా, ఎస్సీ, ఎస్టీల ప్రాంతాల్లో పనులకోసం ప్రత్యేక నిధులిచ్చే పథకాలు ప్రవేశపెడుతున్నా ఆత్మకూరుకు కూతవేటు దూరంలో ఉన్న నువ్వురుపాడు అరుంధతీయ కాలనీ మాత్రం కనీసవసతులకు నోచుకోవడంలేదు. ఆ కాలనీవాసుల ఆవేదన అంతాఇంతా కాదు. నాయకులు, అధికారులు తమ కాలనీ పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారా, వివక్ష చూపుతున్నారా అర్థం కావడం లేదని అంతర్మధనంతో కుమిలిపోతూ ఆరేళ్లపాటు అరిచిగీపెట్టగా ఎట్టకేలకు సిమెంటురోడ్లు నిర్మించారు. అయితే సైడుకాలువలు నిర్మించనందున కాలనీలో ఆరోగ్యపరిస్థితి మాత్రం యధాతధంగా ఉంది. రోడ్లు, సైడు కాలువలు లేక నానా అవస్థలు పడుతున్నామని చెబుతుండేవారు నేడు సైడుకాలువలు కావాలంటున్నారు. దాదాపు 40కుటుంబాల దళితులు దశాబ్దాల తరబడి నివాసాలుంటున్న ఈకాలనీలో ఒకటి మాత్రం సిమెంటు రోడ్లు నిర్మించగా మిగతా అన్నీ నిలువు, అడ్డ రోడ్లన్నీ మట్టిరోడ్లే కావడంతో నాలుగు చినుకులు పడినా అడుగుపెట్టలేని పరిస్థితి, అంచులో రాళ్ళు వేసుకొని నడుస్తూ అగచాట్లు పడుతుండేవారు. సైడు కాలువలు లేనందున వారే రోడ్ల అంచున కాలువలు తీసుకోగా మురుగునీరు ఆకాలువల్లో నిల్వ ఉంటూ దుర్గంధం వెదజల్లుతుంటాయి. ఈకాలనీకి రెండు వైపుల పంటకాలువలు, మరో రెండు వైపుల పంటపొలాలు ఉన్నందున ఈ సైడు కాలువల్లో మురుగు నీరు వెలుపలికి వెళ్ళే పరిస్థితి లేక ఎక్కడిక్కడే నిల్వ ఉంటూ అత్యంత దుర్గంధభరితంగా ఉంటున్నాయి. దాంతో వారంతా అనారోగ్యకర వాతావరణంలో నివాసాలుంటూ కాలం గడుపుతున్నారు. ఒక నెలకాదు, ఒక సంవత్సరం కాదు, దశాబ్ధాలతరబడి వారు తమ గోడును అధికారులకు, నాయకులకు విన్పించేలా అరిచిగీపెడుతుండేవారు. ఎన్నికల సమయాల్లో మాత్రం వారంతా దయనీయమైన పరిస్థితిని నాయకులకు విన్నవించడం, వారు హామీలిచ్చి వెళ్ళడం, ఆమాటే మరువడం పరిపాటిగా మారింది. ఈకాలనీలో సైడుకాలువల్లో నీరు వెలుపలికి వెళ్ళే పరిస్థితి లేక దోమలు అధికంగా ఉంటాయని, నాలుగేళ్ళ క్రితం ఆరేడు మందికి డెంగ్యు సోకగా చెన్నై, నెల్లూరు ప్రాంతాల్లో అధికవ్యయంతో నయం చేయించుకున్నామని, కూలీనాలీ ద్వారా జీవనం చేసుకుంటున్న పేదలమైన తమగోడును వివిద శాఖల అధికారులకు అప్పట్లో విన్నవించినా ఒక్కరుకూడా తమ కాలనీలో అడుగుకూడా పెట్టలేదని వారు ఆవేదనతో వివరించారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి తమ గోడు ఆలపించి కాలనీలో దయనీయంగా ఉన్న పరిస్థితిని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతూనేఉండగా ఏడాదిన్నర క్రితం కక్షను వీడారో,వివక్షను విడనాడారో కానీ సిమెంటు రోడ్లు నిర్మించారు. అయితే సైడుకాలువలు నిర్మించనందున రోడ్లకిరువైపులా బురదనీరు, మురుగునీటి బెడద తప్పడంలేదు. దోమల బెడద తీవ్రంగానే ఉంది. అనారోగ్యకర వాతావరణం కొనసాగుతోంది. ఉన్నతాధికారులు స్పందించి సైడు కాలువలు నిర్మించాలని, ఆ కాలువల ద్వారా నీరు వెలుపలికి వేళ్ళేలా ఏర్పాటు చేయాలని వారంతా కోరుతున్నారు.

## ఆత్మకూరులో ఘనంగా సుల్తాన్‌షాహిద్ గంధమహోత్సవం

- పెద్దఎత్తున అన్నదానకార్యక్రమం
- తెలుగుదేశం ప్రముఖులు హాజరు
- కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణం లోని బివిఎస్ఆర్‌సెంటర్‌లో ఉన్న శ్రీశ్రీశ్రీ హాజరత్ సయ్యదినాసయ్యద్ సుల్తాన్‌షాహిద్ దర్గాలో శుక్ర వారం గంధమహోత్సవాన్ని ఫెస్టివల్ కమిటీ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దర్గాలను విద్యుద్దీపాలతో సర్వాం గసుందరంగా తీర్చిదిద్దారు. శుక్రవారం ఉదయం 11గంటలకు దర్గాలో సుల్తాన్‌షాహిద్ వారి సమాధివద్ద ముజావర్లు ప్రత్యేక నమాజు నిర్వహించగా స్థానిక కమిటీ సభ్యులు, తెలుగు దేశం ప్రముఖులు, భక్తులు అత్యధికంగా పాల్గొ న్నారు. ప్రత్యేకనమాజు అనంతరం సమాధిపై గలేఫులు ఉంచి ఆశీస్సులు పొందారు. పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, రాష్ట్ర తెలుగుదేశం కార్యదర్శి దావా పెంచల రావు, రాష్ట్ర తెలుగుమహిళ కార్యదర్శి పులిమి శైలజారెడ్డి, జిల్లా తెలుగుదేశం అధికారప్రతినిధి చంద్రా వెంకటసుబ్బానాయుడు తదితరులకు స్వామి వారి శేషవస్త్రాలను ఉత్సవకమిటీ ప్రతి నిధులు అందజేశారు. వారు ఆ శేషవస్త్రాలను ధరించి నమాజులో పాల్గొనడంతోపాటు పెద్ద ఎత్తున ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించగా దాదాపు1300మంది భోజనాలు చేశారు. స్థానిక శాసనసభ్యులు, రాష్ట్ర దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఫోన్ ద్వారా అందరికీ గంధమహోత్సవ శుభా కాంక్షలు తెలిపారు. గంధమహోత్సవ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు షేక్ మొహ్మద్‌అబ్దుల్‌బషీర్, సభ్యులు షేక్ అబ్దుల్‌వాజీద్, షేక్ నాయబ్ రసూల్, షేక్ మహబూబ్‌బాషా, గోరీషబ్బీర్, షేక్ మథీన్, షేక్ ఖాదర్‌బాషా, షేక్ హకీమ్, షేక్ ఖాజామస్తాన్, షేక్ రబ్బాని, సయ్యద్ ముజీబ్, సయ్యద్ అస్లామ్, షేక్ ఇనయతుల్లా, పి.అజ్గర్ వల్లీ, సయ్యద్ మునాఫ్‌లు ఉత్సవాల ఏర్పాట్లు గావించి కార్యక్రమాలను ప్రత్యేక శ్రద్ధతో పర్య వేక్షించారు. వేలాదిగా పాల్గొన్న భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు. రాత్రికి గంధాన్ని భాజాభజంత్రీలు, బాణాసంచా, పూలచాందినీలు, ఫకీర్లజరబులు తదితరాలతో ఊరేగింపుగా దర్గాకు తీసుకొ చ్చారు. ప్రత్యేక నమాజు అనంతరం గంధాన్ని సుల్తాన్‌షాహిద్‌స్వామివారి సమాదిపై లేపనంగా పూసిన అనంతరం గంధాన్ని భక్తులకు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, దాసరి మధుసూదన్ రావు, కాపా వెంకట సుబ్బయ్య, చంద్రపాటి మంగమ్మ, పెళ్లూరు సునీత, గోరి సుల్తాన్, మోహిబుల్లా, కౌన్సిలర్ గంధళ్ళ వేణు, తదితరులు పాల్గొన్నారు.



## సీజనల్‌వ్యాధులపట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలి




మురుగుళ్ళలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** సమాజంలోని అందరూ సీజనల్‌వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని, తగు జాగ్రత్తలు పాటించాలని ఆత్మకూరు మండలం మహిమలూరు పిహెచ్‌సి వైద్య,ఆరోగ్య సిబ్బంది కోరారు. పి.హెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ దేవానంద్, డాక్టర్ పి.అనూషల ఆధ్వర్యంలో డెంగ్యు మాసోత్సవంలో భాగంగా శుక్రవారం మండలంలోని మురుగుళ్ళ, నల్లపురెడ్డిపల్లిల్లో అవగాహనా ర్యాలీలు, సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీజనల్‌వ్యాధులైన మలేరియా, డెంగ్యు, చికెన్‌గున్యా, ఫైలేరియా తదితర వ్యాధులు సోకకుండేలా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు. ప్రధానంగా దోమలవలనే ఈ వ్యాధులు సోకుతాయని, దోమతెరలలు వాడడం, ఫ్రైడేడ్రైడేగా పాటించడం, నీరు నిల్వలేకుండేలా జాగ్రత్తలు తీసుకోవడం తదితర అంశాలగురించి వారు ప్రజలకు అవగాహన కల్పించారు. అందరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్ షేక్ సైదా, హెల్త్‌అసిస్టెంట్ లు టి.చెంచునాగేంద్ర, జి.రవీంద్ర, ఏఎన్‌ఎంలు ఎం.రాఘవరాణి, సిహెచ్.రమణమ్మఎంఎల్‌హెచ్‌పి డి.ప్రశాంతి, ఆశాకార్యకర్తలు టి.అంకేశ్వరి, పి.లక్ష్మిదేవి తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా విద్యార్థులకు ప్రత్యేకంగా అవగాహన కల్పించారు.

# పవన్ కళ్యాణ్ పేరు ఉచ్చరించే అర్హత స్థాయి కూడా కాదు మీది




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** గిరిజన మహిళా సర్పంచి సంతకాలను ఫోర్జరీ చేసి గ్రామాలకు గ్రామాలకు రావాల్సిన కోట్లాది నిధులు దుర్వినియోగం చేశారంటూ పవన్ కళ్యాణ్‌కి గిరిజన మహిళా సర్పంచి లేఖపై స్పందిస్తూ జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో గునుకుల కిషోర్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేనే గెలవాలి అని కాక అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలి రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే అందరం కలిసి పనిచేయాలని పవన్ కళ్యాణ్ కోరుతుంటే గిరిజన మహిళా సర్పంచి తన సంతకాలను ఫోర్జరీ చేశారని పవన్ కళ్యాణ్‌కి ఫిర్యాదు చేశారు. ముందు వీటి పై స్పందించండి కాకాని వైయస్సార్సీపి పార్టీలో తొమ్మిది నెలల కిందట తప్పిపోయిన మహిళను తొమ్మిది రోజుల్లో చేదించారు. పవన్ కళ్యాణ్ ఈటీవల జరిగిన మానభంగం కేసులో దోషులు కూడా మైనర్లు అవ్వడంతో వారి విషయంలో చట్టం ఏ విధంగా చెప్పుందో చూసి శిక్షణ అమలు పరచండి అని చెప్పిన పవన్ కళ్యాణ్ గురించి మీరు మాట్లాడే విధానం మీ చేష్టలు విడ్డూరంగా ఉన్నాయి. ఆడపిల్ల అర్ధరాత్రి ఒంటరిగా తిరగలిగినప్పుడు స్వాతంత్రం వచ్చినట్లు అనే మహాత్మా గాంధీ అన్న ఆ రోజుల్లో ఇటువంటి వ్యక్తులు ఉండి ఉంటే వాటిని వక్రీకరించేవారేమో ఈ ఐదు సంవత్సరాల దరిద్రపు వైసిపీ పరిపాలనలో ఉమెన్ ట్రాఫికింగ్ పెరిగిపోయింది ఆడపిల్ల అదృశ్యం కేసులు 30వేలకు పైగా దాటాయి. ఆడపిల్లలను తాకాలంటే భయపడేటట్టు చట్టాలు తీసుకొస్తానని పవన్ కళ్యాణ్ చెప్తుంటే ఆడోళ్ళని చూడాలంటే భయమేస్తుందని, కాంతారా విలన్ నాటకాలు ఆడుతాడు ప్రజా ప్రభుత్వం ఏర్పడి కేవలం 60 రోజులు కూడా దాటలేదు కచ్చితంగా కూడా ఆడబిడ్డల విషయంలో ఇప్పుడున్న శిక్షలు సరిపోవు మరింత కఠినంగా అమలయ్యే విధంగా పవన్ కళ్యాణ్ చూసుకుంటారు. మీ ఫోర్జరీ వైసీపీ ప్రభుత్వంలో జరిగిన దుర్మార్గాల గురించి జవాబివ్వండి మీరు చేసిన దుర్మార్గ పనులన్నీ కూడా ప్రజలకు ఇంకా గుర్తున్నాయి. వాటిని కూడా మీరు సమాధానం ఇవ్వాలి ప్రజలకు కల్తీ మద్యం అమ్మిన విషయంలో గానీ కోర్టులో ఫైల్ మిస్సింగ్ అయిన విషయంలో కానీ మొన్న అక్రమ మైనింగ్ లో అడ్డుపడిన ప్రజాప్రతినిధులపైఎవరితో అయితే అడ్డు కలిపారో అవన్నీ కూడా ప్రజలు గమనించి మీకు సరైన బుద్ది చెప్పారు పవన్ కళ్యాణ్ గురించి మాట్లాడే అర్హత స్థాయి రెండు మీకు లేవు మరొక్కసారి పవన్ కళ్యాణ్ గురించి మాట్లాడితే ఖబడ్దార్ జనసైనికులు తిరుగుబాటుకు నియోజకవర్గం వదిలి పారిపోవాల్సి వస్తుంది. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, సీనియర్ నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, కృష్ణారెడ్డి ఏటూరి రవికుమార్, కాకు మురళి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ అవార్డు గ్రహీత ప్రణీత్‌కు ఎమ్మెల్యే అభినందనలు



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో టీం సేవియర్స్ గత 8 సంవత్సరాల నుండి నిర్వహిస్తున్న వివిధ సేవ, అవగాహనా కార్యక్రమాలు తననెంతో ఆకర్షించాయని కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఇటీవల తమిళనాడు రాష్ట్రం ఊటీలో జాతీయ అవార్డు స్వీకరించిన నల్లిపోగు ప్రణీత్‌ను ఎమ్మెల్యే తన నివాసానికి పిలిపించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీం సేవియర్స్ నిర్వహించే కార్యక్రమాలు హంగులు, ఆర్భాటాలకు దూరంగా, ప్రజలకు శ్రేయోదాయకంగా, యువతకు ప్రేరణదాయకంగా ఉంటాయని పేర్కొన్నారు. ప్రణీత్ జనసేనాని పవన్ కళ్యాణ్ స్పూర్తితో ఈ సంస్థను ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. భవిష్యత్తులో నియోజకవర్గంలో మెగా మెడికల్ క్యాంపులు పెట్టె ఆలోచన ఉందని, వాటి విజయవంతానికి కృషి చేయాలని టీం సేవియర్స్‌ను శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో కావలి జనసేన నాయకులు ఎంవీ సిద్దుతో పాటు టీం సేవియర్స్ సభ్యులు మౌర్య, భార్గవ్, మణిదీప్, ఆకాంక్ష, కృష్ణవేణి, మేఘన, కరిష్మా, మోడరన్ టెక్స్‌టైల్స్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం కల్పిస్తాం : ఎమ్మెల్యే



**కావలి, మేజర్‌న్యూస్ :** 2024 సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘనవిజయాన్ని సాధించిన విషయం తెలిసినదే. అయితే గత కొన్ని సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీ జెండాను మోసి ఎవరు ఎన్ని పార్టీలు నాయకులు మారిన తాను మారకుండా స్థిరంగా ఈరోజు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కీలక పదవులు లభించిన ఆయనే చవలరామకృష్ణ. సుమారు 40 సంవత్సరాల నుండి తెలుగుదేశం పార్టీలో ఉంటూ ఎన్నో కష్టాలు, నష్టాలకు ఓర్చి అధికారం ఉన్న లేకపోయినా స్థిరంగా తను నమ్ముకున్న సిద్ధాంతం కోసం నిలబడ్డ వ్యక్తి ఆర్య వైశ్యులు చవలరామకృష్ణ తను 2021–2023 వరకు రెండు పర్యాయాలు తెలుగు యువత అధ్యక్షులుగా తను చేసిన సేవకు పార్టీ గుర్తించి ఇవ్వడం జరిగింది. అప్పటినుంచి ఇప్పటివరకు కూడా తను పదవిలో ఉన్న లేకపోయినా అదే పార్టీలో కొనసాగుతూ ఉన్నారు. అయితే ప్రస్తుతం కావలి నియోజకవర్గం ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి తనును గుర్తించి కావలి ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్గా పదవి లభించినది అయితే పార్టీలలో కష్టపడ్డ వ్యక్తులకు పదవి రావడం మొట్ట మొదటిసారిగా మన కావలి నియోజకవర్గంలో చూస్తున్నట్లు అనిపిస్తుంది. ఒక పార్టీలో నుంచి ఇంకొక పార్టీలోకి మారిన వ్యక్తులను నాయకులు అధికారాన్ని పదవులు కట్టబెట్టడం చూస్తున్నాం. కానీ కావలి నియోజకవర్గంలో కష్టపడ్డ కార్యకర్తకి సముచిత స్థానం కల్పిస్తానని ఆనాడు ఎన్నికలకు ముందు చెప్పడం ఇప్పుడు ఆచరించడం, అది కావలి ఎమ్మెల్యేకే సాధ్యమైంది. అనంతరం ఏరియా వైద్యశాల డైరెక్టర్ చవల రామకృష్ణ మాట్లాడుతూ.. నేను తెలుగుదేశం పార్టీకి చేసిన సేవను గుర్తించి నాకు సముచిత స్థానం కల్పించి నన్ను ఏరియా వైద్యశాల డైరెక్టర్గా నియమించిన కావలి శాసన సభ్యులకు కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు. నా మీద నమ్మకం ఉంచి ఈ పదవి నాకు ఇచ్చినందుకు విధేయతతో పార్టీకి వ్యతిరేకంగా ప్రవర్తించకుండా ఇచ్చిన ఈ పదవికి న్యాయం చేస్తానని, ఎమ్మెల్యే గౌరవాన్ని కాపాడతానని చవల రామకృష్ణ తెలిపారు. అలాగే ఆత్మకూరు నాగలక్ష్మి, జనసేన నాయకులు పబ్బ సాయి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# ఆక్రమణ భూమిని విచారించిన ఆర్డీవో




**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు తాసిల్దార్ కార్యాలయం పక్కన ఉన్న భూమి ఆక్రమణకు గురైందన్న ఆరోపణలతో ఆత్మకూరు ఆర్డీవో మధులత శుక్రవారం పరిశీలించి విచారించారు. ఆ భూమికి సంబంధించిన లబ్దిదారులను పిలిపించి తగు పత్రాలను చూశారు. అందుకు లబ్దిదారులు తమకు ఎన్నో సంవత్సరాల క్రితం పట్టా అందజేశారని ఆ పట్టాలోనే తాము ఇల్లు నిర్మించుకుంటున్నామని వాపోయారు. ఈ నేపథ్యంలో ఆర్డిఓ మధులత రెవెన్యూ అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. వెంటనే ఆ భూమిని సర్వే చేయించి తగు నివేదికలు త్వరగా పంపాలన్నారు. అనంతరం ఆక్రమించిన వారిపై తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇదే తరుణంలో మర్రిపాడు సమీపంలో ఉన్న ఇసుక రీచ్ ను కూడా పరిశీలించారు. ఆ రీచ్ వద్ద ఎటువంటి అక్రమాలు లేవని తెలియజేశారు.

## మర్రిపాడులో రొట్టెల పండగ వాహనాల రద్దీ

**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు–ముంబై జాతీయ రహదారిపై మర్రిపాడు మండలం మీదుగా రొట్టెల పండగకు గత రెండు రోజుల నుంచి వాహనాల రద్దీ పెరిగింది. అతి పవిత్రమైన ఈ రొట్టెల పండుగ నెల్లూరులో జరుగుతున్నందున ఇటు జిల్లా వాసులే కాకుండా అటు రాయలసీమలోని పలు జిల్లాల నుంచి భక్తులు ప్రత్యేక వాహనాల ద్వారా కుటుంబ సమేతంగా ప్రయాణిస్తున్నారు. ఈ తరుణంలో జాతీయ రహదారిలో రద్దీ పెరిగింది. ప్రధానంగా కార్లు ఆటోల్లో భక్తులు ప్రయాణిస్తున్నారు. సంబంధిత ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను కూడా వేయక పోవడంతో భక్తులు పలు ఇబ్బందులు కూడా ఎదుర్కోక తప్పడం లేదు. నాలుగు రోజులు పాటు జరిగే ఈ రొట్టెల పండుగకు ప్రస్తుత ఏడాది వేలాది సంఖ్యలో తరలి వెళ్తున్నారు. కుల మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులతో ఆనందోత్సాహాలతో వెళ్లడం, రావడం జరుగుతుంది. దీంతో జాతీయ రహదారిలో రద్దీ పెరిగిందని చెప్పవచ్చు.

## సచివాలయాన్ని పరిశీలించిన అధికారులు



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎస్.శ్రీధర్ బాబు, ఈవోపీఆర్ అండ్ ఆర్‌డి అధికారులు శుక్రవారం కావలి రూరల్ మండలం ఆముదాల దిన్నె గ్రామ సచివాలయం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. అక్కడ రికార్డును పరిశీలించి అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రతి సచివాలయం ఉద్యోగి హాజరు పట్టికను సకాలంలో నమోదు చేయాల్సిందిగా సచివాలయం సిబ్బందిని సూచనలు చేశారు. అలాగే గ్రామపంచాయతీలో ఫీల్డ్ నిర్వహించి నీటికి సంబంధిత వ్యాధులు, డయేరియా సోక్కుండా ప్రజలను అప్రమత్తం చేయాలని పరిసరాల శుభ్రతను పాటించాలని అధికారులు సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రమాణ స్వీకారానికి మంత్రిని ఆహ్వానించిన ఆర్యవైశ్య అధ్యక్షులు



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణ ఆర్యవైశ్య ప్రమాణ స్వీకారం ఆగస్టు 18వ తేదీన కావలి మండల ఆర్యవైశ్య సంఘ కమిటీ అధ్యక్షునిగా ఎన్నికైన తటవర్తి రమేష్ తన ప్రమాణ స్వీకారం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక శాఖ మంత్రి టీజీ భరత్‌ను కలిసి వారి కార్యాలయంలో వారిని కలిసి శాలువాతో సత్కరించి ప్రమాణ స్వీకారానికి రావలసిందిగా ఆహ్వానించారు.

# రొట్టెల పండగకు మూడో రోజు భక్తజన ప్రభంజనం

నెల్లూరు, మేజర్‌న్యూస్ : నెల్లూరు బారాషహీద్ దర్గాలో రొట్టెల పండుగకు మూడో రోజు భక్తులు పోటెత్తారు. శుక్రవారం సుమారు 3లక్షల మందికి పైగా భక్తులు దర్గాను దర్శించుకున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. వర్షంలోనూ భక్తుల రద్దీ కొనసాగింది. ఈ 3రోజుల్లో 6లక్షలకు పైగా భక్తులు రొట్టెల పండుగకు విచ్చేసినట్లు అధికారులు అంచనా వేశారు. దేశం నలుమూలల నుంచి విచ్చేసిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణ కాంత్, జేసీ సేదుమాధవన్, మున్సిపల్ అడిషనల్ కమిషనర్ శర్వద ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ అన్ని చర్యలు చేప ట్టడంతో భక్తులందరూ సజావుగా దర్గాను దర్శించుకుని, రొట్టెలు మార్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు. కోర్కెలు తీరిన వారు రొట్టెలను వదలడం.. కోర్కెలతో వచ్చిన వారు ఆ రొట్టెలను స్వీకరించడం వంటి దృశ్యాలతో స్వర్ణాల చెరువు ఘాట్ పరిసర ప్రాంతాలు సరికొత్త శోభను సంతరించుకున్నాయి. జిల్లా యంత్రాంగం పటిష్టంగా చేపట్టిన ఏర్పాట్ల పట్ల సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు తృప్తి వ్యక్తం చేస్తున్నారు.

- వర్షంలోని తగ్గని భక్తులు రద్దీ
- సుమారు 3 లక్షల మందికి పైగా విచ్చేసిన భక్తులు
- లక్ష మందికి పైగా భక్తులకు ఉచిత అన్నదానం
- పోలీసు కంట్రోల్ రూం సేవలు భేష్

### పోలీసు కంట్రోల్ రూం సేవలు భేష్

దర్గా ప్రాంగణంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, క్యూలైన్లు సజావుగా సాగేలా, శాంతి భద్రతలను పరిరక్షించేందుకు పటిష్ట పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. పోలీస్ కంట్రోల్ రూం 24 గంటలూ అనౌన్స్‌మెంట్ చేస్తూ ఎప్పటికప్పుడు భక్తులను అప్రమత్తం చేస్తున్నారు. తప్పిపోయిన చిన్నారులను, వృద్ధులను వెంటనే సంబంధికులకు అప్పగిస్తున్నారు. ఈ మూడు రోజుల్లో సుమారు 400 మందికి పైగా తప్పిపోయిన వారిని గుర్తించి వారి సంబంధికులను అప్పగించారు. దీంతో పోలీసు సేవలను అందరూ శభాష్ అని మెచ్చుకుంటున్నారు.

### పారిశుధ్య సిబ్బంది సేవలు భేష్

దర్గా పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు చెత్తా చెదారాన్ని తొలగిస్తూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్నారు. దర్గా ప్రాంగణాన్ని ఏడు



జోన్లుగా విభజించి పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం చేపడుతున్నారు. మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు సెప్టిక్ ట్యాంక్ వాహనాల ద్వారా శుభ్రపరుస్తున్నారు. దీంతో దర్గా పరిసరాలు పరిశుభ్రతతో కళకళలాడుతున్నాయి. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు.

### వైద్య శిబిరాలు ఏర్పాటు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలు భక్తులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ప్రత్యేక వైద్యులను, సిబ్బందిని బ్యాచ్‌ల వారీగా నియమించి 24 గంటలూ భక్తులకు వైద్య సేవలందిస్తున్నారు. 3వరోజు సుమారు 600పైగా భక్తులకు బిపి, రక్త పరీక్షలు, మందులు అందజేసినట్లు డీఎం అండ్ హెచ్ఓ పెంచలయ్య తెలిపారు.

### అప్రమత్తంగా అగ్నిమాపక శాఖ

స్వర్ణాల చెరువులో ఏ చిన్న ప్రమాదం జరగకుండా అగ్నిమాపక ఆధ్వర్యంలో అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టారు. అప్ర మత్తంగా బోట్లు, రెస్క్యూ బృందాలను సిద్ధంగా ఉంచారు. దర్గా ఆవరణలో అగ్నిమాపక వాహనాలను అందుబాటులో ఉంచారు.

### భక్తులందరికీ అన్నదానం

రొట్టెల పండుగకు విచ్చేస్తున్న భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉచిత అన్నదానాన్ని వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో



నాలుగు అన్నదాన కేంద్రాలను ఏర్పాటు చేసి భక్తులకు అందిస్తున్నారు. తొలిరోజు సుమారు 40 వేలకు మందికి పైగా భక్తులకు అన్నదానం చేయగా, రెండోరోజు 80 వేలమంది కి, మూడో రోజు లక్ష మందికి పైగా భక్తులకు అన్నదానం చేసినట్లు అధికారులు తెలిపారు.



# రాష్ట్రాభివృద్ధి రొట్టె పట్టుకున్న మంత్రి నారాయణ

- ప్రజలందరిపై అల్లాహ్ దయ ఉండాలి
- దర్గా అభివృద్ధి జరిగింది ఒక్క టీడీపీ హయాంలోనే
- బారాషహీద్ దర్గా అభివృద్ధిని విస్మరించిన వైసీపీ ప్రభుత్వం
- దర్గా అభివృద్ధి కోసం సీఎం రూ. 5కోట్లు మంజూరు
- అందరి సమన్వయంతోనే ముందుకెళుతాం
- రొట్టెలకి అశేషంగా తరలి వస్తోన్న భక్తులు
- రొట్టెల పండుగకి పకడ్బందీగా ఏర్పాట్లు చేశాం
- ఏర్పాట్లపై భక్తులందరూ సంతోషంగా ఉన్నారు
- రాష్ట్ర పురపాలక శాఖామంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ
- పాల్గొన్న జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, ఎంపీ, టీడీపీ నేతలు

నెల్లూరు, మేజర్‌న్యూస్ : నెల్లూరు బారాషహీద్ దర్గాలో జరిగే రొట్టెల పండుగ సందర్భంగా.. స్వర్ణాల చెరువులో రాష్ట్ర పురపాలక శాఖామంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ రాష్ట్రాభివృద్ధి రొట్టెను పట్టుకున్నారు. ఆంధ్రరాష్ట్రం బాగా అభివృద్ధి చెందడంతోపాటు ప్రజలందరూ సంతోషంగా ఉండాలని మంత్రి ఆకాంక్షించారు. నెల్లూరు బారాషహీద్ దర్గాలో జరుగుతున్న రొట్టెల పండుగలో.. ఎమ్మెల్యేలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి నారాయణ పాల్గొన్నారు. ముందుగా మంత్రి నారాయణకి దర్గా కమిటీ చైర్మన్, సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దర్గా ప్రాంగణంలో నారాయణ పర్యటిస్తూ.. భక్తుల్ని ఎంతో ఆప్యాయంగా పలకరించారు. ఏర్పాట్లు ఎలా ఉన్నాయని భక్తుల్ని ఆయన అడిగి తెలుసుకున్నారు. ఏర్పాట్లు చాలా బాగున్నాయని మంత్రికి భక్తులు తెలియజేయడంతో సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యేలు, ఎంపీ, టీడీపీ నేతలతో కలిసి మంత్రి నారాయణ రాష్ట్రాభివృద్ధి రొట్టెను పట్టుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు. బారాషహీద్ దర్గా రొట్టెల పండుగ ఈనెల 17వతేదీన ప్రారంభమైందన్నారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా పండుగకి భక్తులు అశేషంగా వస్తుండడం ఆనందంగా ఉందన్నారు. ఈ రోజు ఉదయం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అమరావతి నుంచి వర్చువల్‌గా పండుగ ఏర్పాట్లను పరిశీలించడంతో పాటు భక్తులతో మాట్లాడడం జరిగిందన్నారు. 2014కి ముందు బారాషహీద్ దర్గాలో డెవలప్ మెంట్ పూర్తిగా జీరో అన్నారు. ఇదే స్వర్ణాల చెరువులో లారీలు, కార్లు, బస్సులు శుభ్రం చేసుకునే వారని గుర్తు చేశారు. 2014లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. నేను మంత్రిగా ఉన్నప్పుడు ఎంతో పవిత్రమైన ప్రదేశం బారాషహీద్ దర్గాని ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడి ఎంతో అభివృద్ధి చేశామన్నారు. ప్రధానంగా దర్గా ఆవరణలో మరుగుదొడ్లు, ఘాట్, భక్తులకి అనేక వసతులు ఏర్పాటు చేశామని తెలిపారు. ఆనాడు దర్గాలో ప్రార్ధనా మందిరం నిర్మించాలని, రొట్టెల పండుగకి చంద్రబాబు వచ్చారని, అప్పుడే దర్గా అభివృద్ధికి రూ. 20 కోట్లు మంజూరు చేశారన్నారు. కానీ ఆ పనులను గత ప్రభుత్వం నిలిపి వేసిందన్నారు. ఈరోజు జరిగిన వర్చువల్ కార్యక్రమంలో వెంటనే ఆ పనులను పూర్తి చేయాలని, అప్పుడే రూ.5 కోట్ల రూపాయలను చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. ఈ సందర్భంగా దర్గా కమిటీ, ప్రజలు, భక్తుల తరపున సీఎం చంద్రబాబుకి ప్రత్యేకంగా ధన్యవాదాలు



తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. ఎందుకంటే రాష్ట్ర ఖజానా ఖాళీ అని, ఏ శాఖలోనూ పైసా లేదన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అతలాకుతలంగా ఉందన్నారు. ఇటువంటి పరిస్థితిలో కూడా రూ.5కోట్లు మంజూరు చేయడం గొప్ప విషయమన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగు పడిన తరువాత ముస్లిం మత పెద్దలు, కమిటీ సభ్యులు, వక్ఫ్ బోర్డు సభ్యులు, నాయకులతో మాట్లాడి ఒక ప్రణాళికంగా ముందుకెళ్లి దర్గాని అన్నీ విధాలా అభివృద్ధి చేస్తామని చెప్పారు. రొట్టెల పండుగకి తెలుగుదేశం ప్రభుత్వమే రాష్ట్ర పండుగగా చేసిందన్నారు. ఈ పండుగని ఇంటర్నేషన్ పండుగగా చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించడం జరిగిందన్నారు. రొట్టెల పండుగపై భక్తులకి ఎంతో నమ్మకం ఉందన్నారు. వారి కోర్కెలు తీరడంతోనే ఏడాదికేడాది భక్తుల సంఖ్యలో గణనీయంగా పెరుగుతుందని తెలిపారు. తదనంతరం జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి, ప్రశాంతిరెడ్డి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్లపాక అనూరాధలు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తో పాటు, కొవ్వూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్లపాక అనురాధ, కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, టీడీపీ ముఖ్య నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి లోకేష్ సారథ్యంలో విద్యారంగానికి పెద్దపీట

- విద్యార్థులకు విద్యా కిట్లు పంపిణీ
- వీపీఆర్ ట్రస్ట్ సహకారంతో కోవూరు బాలికల హాస్టల్‌కు ఇన్వర్టర్, ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ ఏర్పాటు
- ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నారా లోకేష్ సారథ్యంలో ప్రభుత్వ పాఠశాలలు ఉన్నత విద్యా ప్రమాణాలకు నిలయాలు కానున్నాయని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. కోవూరు బాలికల పాఠశాల, కొడవలూరు మండలం కొత్త వంగల్లు హై స్కూల్స్‌లో జరిగిన విద్యా కిట్ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజల్వన చేసి ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సభావేదిక పై నుంచి నేరుగా విద్యార్థినుల వద్దకు చేరుకున్న ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గారు స్కూలు, హాస్టళ్ళలో ఎదురుకుంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కరెంటు పోతే చదువు కోనేందుకు ఇబ్బందిగా ఉందన్న విద్యార్థినుల సమస్య పై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి స్వంత నిధులతో హాస్టల్‌కు ఇన్వెర్టర్ చేసేలా సిబ్బందిని ఆదేశించారు. హాస్టల్లో ఫ్యాన్ల రిపేర్లు, బ్లాక్ బోర్డులు, తరగతి గదుల్లో పెచ్చులూడిన స్లాబ్లకు మరమ్మత్తులు చేసేందుకు అధికారులను ఆదేశించారు. వీపీఆర్ ఫౌండషన్ సహకారంతో సహకారంతో బాలికల పాఠశాలలో ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని వ్యక్తిగత సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థినులకు కిట్లు పంపిణి చేసిన అనంతరం ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ.. ప్రతిభావంతులైన విద్యార్థినీ విద్యార్థులను ప్రోత్సాహించడం తనకెంతో ఇష్టమన్నారు. దాదాపు 300 మందికి ఉచిత విద్‌అందించే వీపీఆర్ విద్యాలయానికి కరస్పాండెంట్‌గా సేవలందిస్తున్న తన అనుభవాలను వివరించారు. కోవూరు నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ పాఠశాలల్లో ఏ అవసరం వచ్చినా ఎమ్మెల్యే అయిన తనను ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని సంప్రదించాలన్నారు. రాష్టంలో విద్యారంగానికి పెద్ద పీట వేసేలా ముఖ్యమంత్రి చంద్రబాబుకార్యాచరణ రూపొందిస్తున్నారని విద్యాశాఖ మాత్యులైన నారా లోకేష్ గారి ఆధ్వర్యలో ప్రభుత్వ పాఠశాలలకు మహర్ధశ పెట్టనుందన్నారు. పిల్లలకు విద్యతో పాటు నైతిక విలువల బోధన చేయాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఉపాధ్యాయులను కోరారు. ప్రతి ఒక్కరు పిల్లలను చదివించి భావి పౌరులుగా తీర్చి దిద్దాలని కోరారు. విద్యా బోధనలో ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలని కోరారు. పేదరికాన్ని జయించాలంటే చదువు ఒక్కటే మార్గమని తల్లి తండ్రులు సైతం ఈ వాస్తవాన్ని గ్రహించి పిల్లలను పాఠశాలలకు పంపాలని కోరారు. కోవూరులో జరిగిన విద్యాకిట్ల పంపిణీ కార్యక్రమంలో మండల విద్యాశాఖధికారి రవి టీడీపీ జిల్లా కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు యింతా మల్లారెడ్డి స్థానిక ప్రజా ప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులైన జెట్టి రాజగోపాల్ రెడ్డి, తిరుమూర్ అశోక్ రెడ్డి, కొల్లారెడ్డి సుధాకర్ రెడ్డి, కొల్లారెడ్డి సునీల్ రెడ్డి, యద్దలపూడి నాగరాజు, నాటకరాణి వెంకట్, చిన్న కృష్ణారెడ్డి. గుంజి మస్తాన్, వేమారెడ్డి హరికృష్ణారెడ్డి, షేక్ సాదిక్, షేక్ ఫిరోజ్, విన్నకోట రాఖి, షేక్ షఫీ షేక్ జహంగీర్, షేక్ జమీర్, కరేటి శ్రీనివాసులు, కరేటి అమరావతి, వేగురు సుబ్బానాయుడు, పానేటి సురేష్, దారా విజయబాబు, చెరుకూరి మహేష్, పొబ్బారెడ్డి మల్లి కార్జున రెడ్డి, జనసేన నాయకులు హరిరెడ్డి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. కొత్త వంగల్లు విద్యాకిట్ల పంపిణీ కార్యక్రమంలో స్థానిక ఉపాధ్యాయ సిబ్బందితో పాటు టిడిపి మండల నాయకులు అమరేందర్ రెడ్డి, స్థానిక నాయకులు చక్కా మదన్ మోహన్, చక్కా నారాయణ, చక్కా శివకుమార్, జనసేన నాయకులు శూలం బాబు, బిజెపి నాయకులు పగడాల మురళి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# డ్రైవర్ల మధ్య వివాదమే.. పోర్టు ప్రమేయం లేదు

- విలేకరుల సమావేశంలో వోల్వో డ్రైవర్లు



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** కృష్ణపట్నం పోర్ట్‌లో జరిగిన స్వల్ప ఘర్షణ డ్రైవర్ల మధ్య వివాదమే కారణమని అదాని కృష్ణపట్నం పోర్టుకు ఎలాంటి సంబంధం కానీ, ప్రమేయం గాని ఏమాత్రం లేదని పరిశ్రమల యాజమాన్యాలపై కార్మిక సంఘాలు బురద చల్లడం మంచి విధానం కాదని పోర్టుకు చెందిన వోల్వో డ్రైవర్లు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రైవేట్ హోటల్ నందు కొంతమంది డ్రైవర్లు ఈ సంఘటనపై మీడియా సమావేశం జరిపారు. సూర్యనారాయణ పై జరిగిన స్వల్ప ఘర్షణకు ఆర్థిక కారణాలు ఉన్నాయని డ్రైవర్లు స్పష్టం చేశారు. ఈ ఘర్షణ పై పోలీస్ కేసు నమోదు చేయాలని కార్మిక సంఘాలు కోరడం న్యాయమా అన్నారు. డ్రైవర్ల మధ్య జరిగిన సంఘటనకు కేసులకు సంబంధం ఏమిటి అని డ్రైవర్లు ప్రశ్నించారు. కార్మిక సంఘాల్లో చేరకపోతే ఇబ్బందులు పెడతారా అంటూ డ్రైవర్లు నిలదీశారు. కృష్ణపట్నం పోర్టులో 12 గంటలు పని ఇష్టపూర్వకంగా చేస్తున్నామని వాల్వో డ్రైవర్లు అన్నారు. కార్మికుల మధ్య ఎలాంటి వివాదాలు లేవని అన్నారు. హాస్పిటల్ రికార్డులు కూడా మీడియా ప్రతినిధులకు చూపడం జరిగింది. ఈ సమావేశంలో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

## చెరువు తూము మరమ్మత్తు పనులు ప్రారంభం



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** అనంతసాగరం చెరువు మరమ్మత్తు పనులను ఇరిగేషన్ శాఖ శుక్రవారం ప్రారంభించింది. తూములు కాలం చెల్లి మరమ్మత్తులకు గురై పంట కాలువలకు నీటి పంపిణీ సాగని దుస్థితి ఏర్పడింది. దీనితో ఆయకట్టు రైతాంగం మంత్రి ఆనం దృష్టికి తమ బాధలను విన్నవించారు. మంత్రి ఆదేశాలతో ఆ శాఖ ఇటీవల చెరువులు సందర్శించి పనులకు సంబంధించి తగు ప్రతిపాదనలు చేశారు. ఈ నేపథ్యంలో మరమత్తు పనులకు కావలసిన మెటీరియల్ను చెరువు వద్దకు చేర్పించారు. పనులు నిర్వహించేందుకు అనువుగా ఇసుక బస్తాల ఏర్పాటును చేపట్టారు. శనివారం నుంచి మరమత్తు పనులు వేగం కానున్నాయి. పనుల నిర్వహణ చేపట్టడంపై ఆయకట్టు రైతాంగం ఆనంకు కృతజ్ఞతలు తెలిపారు.

## మంత్రి సోమశిల పర్యటన వాయిదా

**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** సోమశిల జలాశయాన్ని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శనివారం పర్యటన కార్యక్రమం వాయిదా పడింది. కొన్ని అనువార్య కారణాల వలన మంత్రి పర్యటన రద్దు అయిందని మండలాధ్యక్షురాలు మునగపాటి సునీత తెలిపారు. షెడ్యూల్ ప్రకారం సోమేశ్వర ఆలయంతోపాటు ఆఫ్రాన్ ప్రాంతంలో జరుగుతున్న పనులను పరిశీలించేందుకు మంత్రి రావాల్సి ఉంది. అయితే నేటికీ పనుల ప్రారంభం కాకపోవడం, మంత్రి మరో కార్యక్రమానికి హాజరు కానున్న నేపథ్యంలో సోమశిల సందర్శన వాయిదా పడినట్లు తెలుస్తోంది.

లింగాలపాడులో ఇప్పటికి..

# వైసీపీ పెత్తనమే నడుస్తోంది

- కావలి జనసేన ఇన్‌చార్జ్ సుధాకర్‌కు వినతి

**దగదర్తి, మేజర్‌న్యూస్ :** కావలి జనసేన పార్టీ కార్యాలయంలో ఇన్‌చార్జ్ అళహరి సుధాకర్‌ను కలిసిన దగదర్థి మండలం ధర్మవరం పంచాయితీ లింగాలపాడు గ్రామ జనసేన నాయకులు మండల అధ్యక్షుడు వెంకట్ యాదవ్ ఆధ్వర్యంలో కావలి పార్టీ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడిన దగదత్తి మండలం లింగాలపాడు గ్రామములో ఇంకా వైసిపి పార్టీ నాయకుల అధిపత్యమే నడిస్తుందని ఆయా గ్రామాలలో మట్టిని యదేక్షగా తవ్వుతున్నారని వారు పదవులలో ఉన్నప్పుడు ప్రజలను భయభ్రాంతులకు గురి చేసిన వాళ్లకే ఒక వర్గం టీడీపీ వాళ్లు.వాళ్లుకే కొమ్ముకాస్తున్నారని ఎన్నికల సమయంలో టిడిపికే పనిచేశారని బూటకపు మాటలు చెప్పి వారినే (వైసీపీ) వాళ్లనే ప్రోత్సహిస్తుంటే గ్రామ ప్రజలు ఇంకా ఉమ్మడి ప్రభుత్వము వచ్చి ఏమి లాభము అని వాపోతూరు అని తెలిపారు. ఈ విషయాలను జనసేనాని ఆంధ్రప్రదేశ్ ఉప-ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లమని ఇది వారి మంత్రి వర్గం కిందకే వస్తుందని వారు కోరారు. వారు ఇచ్చిన అర్జీని ముందు మన కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి దృష్టికి తీసుకు వెళతానని అదే కాపీని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకు వెళతానని అన్నారు. త్వరలో ఈ సమస్యకు పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మద్దెల బాలకృష్ణ, శ్రీక్షాంత్, సాయి, రాజేష్, అజిత్, బ్రహ్మయ్య, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన గృహాన్ని ప్రారంభించిన జీడీడీ దివాకర్



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలోని షారోన్ బాప్టిస్ట్ చర్చ్ సంఘ కాపరి పాడేటి దైవాధీనం నూతనంగా గృహాన్ని నిర్మించుకున్నారు. ఈ గృహాన్ని శుక్రవారం ఏడు రాష్ట్రాల క్రిస్టియన్ ప్రాపర్టీ సంస్థ అధినేత డాక్టర్ జీడీడీ దివాకర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నూతన గృహాన్ని ప్రారంభించడం నాకు ఎంతో సంతోషంగా ఉందని నూతనంగా నిర్మించిన గృహం చాలా ఆహ్లాదకరంగా బాగుందని ఇలాగే సంఘ కాపరిగా క్రైస్తవుల అభివృద్ధి తోడ్పడాలని తెలిపారు. అలాగే రాష్ట్రం బాగుండాలని, రాష్ట్రంలో మంచి పరిపాలన కావాలని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడును కలవడం జరిగిందని వారు తెలిపారు. కలిసిన సందర్భంగా చంద్రబాబు నాయుడు మీకు ఏ పదవి కావాలని నన్ను అడగ్గా అందుకు నేను పదవి కోసం రాలేదని రాష్ట్రం బాగుండాలని రాష్ట్ర ప్రజలు మిమ్మల్ని ముఖ్యమంత్రిగా చేసుకుంటే రాష్ట్రానికి సుపరిపాలన అందిస్తారని ప్రజలు, రైతులు సుఖశాంతులతో ఉంటారు అని ఆలోచించి నిర్ణయం తీసుకొని వచ్చానని, అంతేకానీ ఏ పదవులు వద్దని చెప్పడం జరిగిందని జరిగిన సంభాషణ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ ఐజాక్ ఈ జైపాల్, ప్రభాకర్, ప్రసాద్, ఎడ్విన్ ప్రసాద్ కే.మల్లికార్జున ఎం.కిషోర్ ,పాడేటి థామస్ తదితరులు పాల్గొన్నారు.

## పొగాకు కోటాను నిర్ణయించిన బోర్డు



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** గుంటూరులో పొగాకు బోర్డ్ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఫుల్బోర్డ అధికారులు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో 2024-25 సంవత్సరం పంట కాలానికి బారన్ కోటాను నిర్ణయించారు. ఎస్ఎల్ఎస్ రీజియనలో బారన్ ఒక్కంటికీ 42.75 క్వింటాళ్ళు, ఎస్బీఎస్ రీజియన్లలో 41.75క్వింటాళ్ళు, ఎన్ఎల్ఎస్ రీజియన్లో 41.25 క్వింటాళ్లుగా నిర్ణయించినారు. ఈ కార్యక్రమంలో పొగాకు బోర్డ్ చైర్మన్ సీహెచ్ యస్వంత్ కుమార్, ఏ.శ్రీధర బాబు, బోర్డు అధికారులు, బోర్డు మెంబర్లు, వ్యాపార ప్రతి నిధులు, రైతు నాయకులు పాల్గొన్నారు.

# వాసిలిలో భవనాలన్నీ పునాదులకే పరిమితం


సచివాలయ భవనాల పునాదులు

- భవనాలు కూల్చినా, కలప అన్యాక్రాంతమైనా చర్యలుశూన్యం
- చెరువులో చేపలు స్వాహా
- రాజ్యాంగేతరశక్తిదే ఇష్టారాజ్యం
- చోద్యం చూస్తున్న యంత్రాంగం


ఆర్బికె భవనాల పునాదులు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలం వాసిలిలో ఎన్నితప్పిదాలున్నా, ఫిర్యాదులు చేస్తున్నా, పత్రికలు ఘోషిస్తున్నా అధికారులు మాత్రం విచారణలు జరుపుతున్నారే కానీ ఎలాంటి చర్యలు తీసు కున్న దాఖలాలు కానరావడం లేదు. ఆగ్రామంలో అధికారులకెందుకింత ఉదాసీనత అనేది అర్థం కావడం లేదని పలువురు గ్రామస్థులే వ్యాఖ్యానిస్తున్నారు. ఎన్ని తప్పిదాలున్నా, నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్నా యంత్రాంగం చోద్యం చూస్తోంది. ప్రజాప్రతినిధుల వత్తిడితోనే అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ఆగ్రామంలో పాఠశాల, పంచాయతీ కార్యాలయ, పాలకేంద్ర భవనాలు ధ్వంసం చేసినా, వాటిలో కలపను అన్యాక్రాంతం చేసినా, అందుకు ఎలాంటి అనుమతులు లేకున్నా, ఈభవనాల నుండి తొలగించిన శకలాలను ఎఫ్‌డిఆర్ నిధులతో వేసే రోడ్డుకు తోలినా ఎవరూ పట్టించుకునే పరిస్థితి లేదు. సమీపంలోని వెంకట్రావుపల్లి, నరసాపురం సమీపంనుండి వందలాది ట్రాక్టర్ల మట్టిని ఎలాంటి అనుమతిలేకుండా తరలించినా, సచివాలయం, ఆర్‌బికె కార్యాలయాల భవనాల పనులు మూడేళ్ళ క్రితం చేపట్టి పునాదులకే పరిమితం చేసినా, ఆభవనాలకు సంబంధించి సిమెంటును అన్యాక్రాంతం చేసినా ఎవరూ పట్టించుకోలేదు. ఇదిలా ఉండగా గత ఏడాది ఆగ్రామ చెరువులో దాదాపు 10లక్షల రూపాయల విలువగల చేపలను అక్రమంగా పట్టించి సొమ్ముచేసుకున్నా కూడా ఎవరికీ పట్టలేదు. ఆగ్రామ సర్పంచ్ వైసిపి కాగా ఆమెను దూరంచేస్తూ అదే పార్టీకి చెందిన ఓ వైసిపి నాయకుడు రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరిస్తూ ఈభవనాలను కూల్చినా, కొత్తభవనాలు పునాదులకే పరిమితం చేసినా, చేపలను కొల్లగొట్టినా, అధికారులు చూసీచూడ నట్లుగా మౌనందాల్చడం, ఏదేని పత్రికల్లో ఈ అంశాలు ప్రచురితమైనపుడు తూతూ మంత్రంగా విచారణలు జరపడమే తప్ప ఎలాంటి చర్యలు లేనేలేవు. దాంతోపాటు ఆగ్రామ ఉన్నత పాఠశాలకు 3గదులు దాదాపు 90 లక్షల రూపాయలతో మంజూరుకాగా హైస్కూల్లో పనులు ప్రారంభించిన 2వరోజే ఆ నాయకుడు నిలిపివేసి గ్రామంలో భవనాలు తొలగించబడిన ప్రాథమిక పాఠశాల ఆవరణలో భవనాల నిర్మాణానికి పనులు ప్రారంభించి అక్కడ కూడా పునాదులకే పరిమితం చేశారు. జాతీయరహదారిపై వాసిలి బస్టాండు వద్ద హైస్కూలు ఉండగా గ్రామంలోని ప్రాథమిక పాఠశాల వద్ద తరగతి భవనాలు నిర్మించడం విడ్డూరంగా ఉందని పలువురు వ్యాఖ్యానించినా పట్టుబట్టి పనులు ప్రారంభించి సచివాలయం, ఆర్‌బికెల్లాగే పునాదులకే పరిమితం చేశారు. గ్రామంలో సచివాలయం మాత్రం నాలుగేళ్ళుగా ఒక అద్దె భవనంలో నిర్వహిస్తుండగా నెలకు 3వేల రూపాయల అద్దె చెల్లిస్తుండగా ఏడాదికి 36వేలు, ఇప్పటి వరకు 1,50,000 రూపాయలు చెల్లించారు. కొత్త భవనాలు పునాదులవరకే ఉండడంతో అవి ఎప్పటికి పూర్తవుతాయో, ఈ అద్దె ఇంకెన్నాళ్ళు చెల్లించాలో అంటూ గ్రామస్థులు వ్యాఖ్యానిస్తున్నారు. ఆగ్రామ దళిత మహిళా సర్పంచ్‌కు ఆనేతకానీ, అధికారులుకానీ, సిబ్బందికానీ సహకరించే పరిస్థితి లేదని, తన సంతకాలు ఫోర్జరి చేశారని, కొన్నిదపాలు ప్రోటోకాల్ పాటించలేదని ఆమె పలుదపాలు జిల్లా, మండల అధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితం లేనందున పార్టీ కార్యక్రమాలకు గత కొంతకాలంగా దూరంగా ఉంటూ ఏదో కార్యాలయానికి వెళుతూ ఆమె చేసిన పనులకు కూడా నిధులు రాకుండా ఆనేత అడ్డుపడుతున్నా ఏమీచేయలేక, ఎవరి సహకారం లేక లోలోన మదనపడుతూ ఉంది. పునాదులకే పరిమితమైన భవనాలకు సంబంధించి సిమెంటు ముందుగానే తీసుకొని అన్యాక్రాంతం చేశారని, దాదాపు 20లక్షల రూపాయల నిధులు కూడా పొందారని చెబుతున్నారు. ఈ ఆరోపణలు, సర్పంచ్‌కు సహాయనిరాకరణ, అనుమతి లేకుండా భవనాల కూల్చివేత, కలప అన్యాక్రాంతం, చేపలు కొల్లగొట్టడం తదితరాల గురించి ఆయా సందర్భాల్లో అధికారుల దృష్టికి తీసుకెళితే విచారణ జరుపుతాం, చర్యలు తీసుకుంటాం అంటారేకానీ అలాంటి పరిస్థితే కానరావడం లేదు. కొన్ని దపాలు విసిగిపోయిన దళితమహిళా సర్పంచ్ అసలు తనకు ఈ సర్పంచ్ పదవి అవసరమా అన్పిస్తుందని, సిబ్బంది కూడా తనను ఖాతరుచేయడంలేదని, దళిత సర్పంచ్ననే చులకనగా లెక్క చేయడం లేదని బాధపడడంతోపాటు జిల్లా కలెక్టరుకు కూడా స్పందన కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించారు. విచారించాలని కలెక్టర్ స్థానిక ఇవోపిఆర్‌డికి పంపగా ఇంకేముంది యధారాజాతథాప్రజ అన్న చందంగా మూలనబడిరది. భవనాల నిర్మాణాలంటూ దాదాపు 2వేల బస్తాల సిమెంటు ప్రభుత్వం సరఫరాచేయగా అందులో పెద్దమొత్తంలో సిమెంటును అన్యాక్రాంతం చేశారని, కొంత సిమెంటు గడ్డకట్టేంతవరకు వినియోగించలేదని గ్రామంలో ఆరోపణలు వెల్లువెత్తగా సంబంధిత అధికారులు విచారణ జరిపారని, ఎలాంటి చర్యలు లేవని గ్రామస్థులు కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. ఈవిషయమై **మేజర్‌న్యూస్** పదేపదే అధికారుల దృష్టికి తెచ్చినా గత ప్రభుత్వహయాంలో కుంటిసాకులతో దాటవేశారు. ఆరోపణలు వచ్చినపుడు తూతూమంత్రంగా విచారణలు జరపడమేతప్ప ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని గ్రామస్థులు పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. మరి ఉన్నతాధికారులు కూడా ఎందుకు ఉదాసీనంగా ఉంటున్నారో అని కూడా వ్యాఖ్యానిస్తున్నారు. నూతన ప్రభుత్వంలోన్కైనా జిల్లా అధికారులు స్పందిస్తారేమో చూడాల్సి ఉంది.


పాఠశాల భవనాలపునాదులు


అద్దె భవనంలో సచివాలయం


శిధిలమవుతున్న పునాదులు

# హైవేపై అలంకారప్రాయంగా బస్‌షెల్టర్లు

- సైజు స్వల్పం.. బస్టాండ్లకు దూరం..
- పట్టించుకోని అధికారయంత్రాంగం



నెల్లూరు-ముంబాయి రహదారిపై చిన్నవిగా నిర్మించిన బస్‌షెల్టర్లు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు-ముంబాయి రహదారిపై ఆత్మకూరు, మర్రిపాడు ప్రాంతాల్లో నిర్మించిన బస్‌షెల్టర్లు అలంకారపాయంగా దర్శనమిస్తూ ప్రయాణీకులకు ఏమాత్రం అక్కరకు రాకుండా నిరుపయోగంగా ఉంటున్నాయి. ఈ షెల్టర్ల నిర్మాణాలు బస్టాండ్లుకు దూరంగా ఉన్నందన వాటిని ప్రయాణీకుల కోసం నిర్మించారా, కాంట్రాక్టర్ల పబ్బం గడుపుకునేందుకా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. కనీసం నలుగురు కూడా సక్రమంగా వేచి ఉండలేని విధంగా చిన్నవిగా నిర్మించారు. అదీగాక వర్షం కురిస్తే నలువైపుల నుండి ఝల్లులు లోనికి పడేలా ఉన్నాయి. ప్రయాణీకులు బస్సుల కోసం వేచి ఉండాల్సిన ఈ షెల్టర్లను కనీపం 10మంది ఉండేలా నిర్మించకపోవడం గమనార్హం. ఇదిలా ఉండా ఈప్రాంతంలో చూస్తుంటే బస్టాండ్లుగా అందరూ వేచిఉండేచోట లేదా బస్సులు ఆగేచోట కాకుండా దూరంగా షెల్టర్లు నిర్మించారు. నెల్లూరుపాళెం వద్ద నాలుగు రోడ్ల కూడలి కాగా అటు బద్వేలు వైపు అర్థకిలోమీటరు దురంలో నిర్మించారు. నెల్లూరు వైపు కూడా దరంగా ఏర్పాటు చేశారు. ఆత్మకూరు, వింజమూరుల వైపు నిర్మించలేదు. సరే హైవేలో మాత్రమే నిర్మించారని భావిస్తే బస్సులు నిలిచే కూడలిలో కాస్తా అటో, ఇటో నిర్మించకుండా దూరం నిర్మించారు. అక్కడ బస్సులు ఆగినా ప్రయాణీకులు లగేజిలతో మళ్ళీ సెంటరు వరకు నడిచిరావాల్సిందే. నాలుగు రోడ్ల కూడలిలో ఒక వైపు దూరంగా దిగితే రెండో మార్గంలో బస్సు కోసం సెంటరు వరకు నడవాల్సి ఉంటుంది. ఏద్కెనా గ్రామమో, పట్టణమో అయితే చివరన బస్టాండున్నా అక్కడ ప్రయాణీకులు దిగి ఆటోలనో, ఇతర వాహనాలనో ఆశ్రయిస్తారు. కానీ హైవేపై బస్టాండుల వద్ద నిర్మిస్తే బాగుండేది. కానీ ఆవిషయం ఎవరూ పట్టించుకోలేదు. కాంట్రాక్టర్లు మాత్రం ఇష్టమొచ్చిన చోట నిర్మించారని సర్వత్రా వ్యాఖ్యానిస్తున్నారు. నారంపేట వద్ద ఒక బస్‌షెల్టరు ఉన్నా మళ్ళీ హైవే ప్రకారం రెండిరటిని నిర్మించారు. ఈగ్రామంలో పాఠశాల పేరుతో కూడా 3భవనాలు గతంలో సిద్ధం చేశారని పలువురు వ్యాఖ్యానిస్తుంటారు. ఏదేమైనా హైవేపై నిర్మించిన షెల్టర్లు మాత్రం ప్రయాణికులకు అనువుగా నిర్మించలేదని సర్వత్రా వ్యాఖ్యానిస్తున్నారు. గత ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదని, నూతన ప్రభుత్వమైనా పరిశీలించాలని సర్వత్రా కోరుతున్నారు.


బస్టాండులకు దూరంగా షెల్టర్లు నిర్మించిన దృశ్యం

# రొట్టెలపండుగ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి నారాయణ

- బారాషహీద్ దర్గాకు విచ్చేసిన మంత్రికి ఘనస్వాగతం పలికిన జిల్లా కలెక్టర్, ఎస్పీ, అధికారులు
- దర్గాలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి
- భక్తులకు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశం



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన నెల్లూరు బారాషహిద్ దర్గా రొట్టెల పండుగ ఏర్పాట్లను రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ గురువారం రాత్రి పరిశీలించారు. దర్గాకు విచ్చేసిన మంత్రి నారాయణకు జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం బారాషహీద్ దర్గాకు సంబంధించి రొట్టెల పండుగ ఏర్పాట్లపై జిల్లా అధికారులతో చర్చించారు. దర్గా మ్యాప్‌ను పరిశీలించారు. అనంతరం దర్గాలో మంత్రి నారాయణ పర్యటించారు. ఎల్ఈడీ స్క్రీన్లను పరిశీలించారు. భద్రత ఏర్పాట్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. రొట్టెల పండుగకు భక్తులు అధికసంఖ్యలో రానున్న నేపథ్యంలో ఎప్పటికప్పుడు భద్రత చర్యలతో పాటు ఏర్పాట్లను పర్యవేక్షిస్తుండాలని సూచించారు. ఎక్కడ కూడా భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని, స్వర్ణాలచెరువులో నీటిశుభ్రతకు శ్రద్ధవహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ వెంట అబ్దుల్ అజీజ్, జేసీ సేదుమాదవన్, ఇతర శాఖల అధికారులు, టీడీపీ ముఖ్యనేతలు ఉన్నారు.

# విద్యా రంగానికి పెద్ద పేట : కోవూరు ఎమ్మెల్యే



**విడవలూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తుందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మండలంలోని అన్నారెడ్డి పాలెం గ్రామంలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం విద్యా కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో విద్యారంగ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే విద్యార్థులకు విద్యా ఉపకారణాలు కలిగిన కిట్లను అందజేయడం సంతోషకరంగా ఉందన్నారు. అంతేకాకుండా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విద్యారంగంపై ప్రత్యేక దృష్టి ఉంచారని ఆ రంగాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు ఆయన సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ప్రతి విద్యార్థి విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆమె ఆకాంక్షించారు ప్రతి పేద విద్యార్థికి ప్రభుత్వం అండగా ఉంటుందని వారికి కావలసిన వసతులను కల్పించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు కిట్లను బిస్కెట్ ప్యాకెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో శ్రీనివాసులు, నాయకులు సింహాద్రి అయ్యప్ప, సురేష్, బెజవాడ వంశీ కృష్ణారెడ్డి, చెముకుల కృష్ణ చైతన్య, చెముకుల శ్రీనివాసులు బెజవాడ గోవర్ధన్ రెడ్డి, పాశం శ్రీహరి రెడ్డి, సత్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అదాని ఫౌండేషన్ ద్వారా కృష్ణపట్నంలో అభివృద్ధి పనులు



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** అదాని ఫౌండేషన్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు, అదేవిధంగా అభివృద్ధి పనులు వేగవంతం చేస్తూ పారిశ్రామిక ప్రాంతమైన కృష్ణపట్నంలో సామాజిక సేవా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నామని అదానీ ఫౌండేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్. అభిషేక్ లఖ్టాకియా అన్నారు. శుక్రవారం సదరన్ రీజియన్ సిఎస్ఆర్ హెడ్ డాక్టర్ అనిల్ బాలకృష్ణన్‌తో కలిసి అదానీ ఫౌండేషన్‌కు చెందిన కృష్ణపట్నం అభివృద్ధి స్థలాన్ని సందర్శించారు. ఫౌండేషన్ ద్వారా గ్రామాల్లో చేసిన పనులను ఆయన పరిశీలించారు. గ్రామ పంచాయితీలోని రామ్‌నగర్, ఆర్కాట్‌పాలెం కృష్ణపట్నం గ్రామాలలో డాక్టర్ అభిషేక్ లఖటకియా డాక్టర్ అనిల్ బాలకృష్ణన్ వాటర్ ప్లాంట్ సౌకర్యాలను సందర్శించి నూతనంగా ఏర్పాటుచేసిన ఆర్ఓ వాటర్ ప్లాంట్ ప్రారంభించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. అదానీ ఫౌండేషన్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనానం సరఫరా చేయడానికి మహిళా బృందం నిర్వహిస్తున్న సెంట్రల్ కిచెన్‌ను డాక్టర్ అభిషేక్ లఖటాకియాతో కలిసి డాక్టర్ అనిల్ బాలకృష్ణన్ ప్రారంభించారు. అదేవిధంగా ముత్తుకూరు మండల కేంద్రంలో అదానీ విద్యా మందిర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలను సందర్శించారు. అక్కడ పాఠశాల ప్రిన్సిపాల్ జె.శ్రీనివాస్ రావు అదానీ జూనియర్ కళాశాల డాక్టర్ అభిషేక్, డాక్టర్ అనిల్‌లను పాఠశాలను పరిశీలించి పాఠశాల తీరు బాగుందని అభినందించారు. పాఠశాలల విద్యార్థులతో వారు ముచ్చటించారు. పాఠశాలలో, విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు అదాని కృష్ణపట్నం పోర్టు లిమిటెడ్ యొక్క పునరావాస, పునరావాస కాలనీల కాపులతో సంభాషించారు. ఆర్ అండ్ ఆర్ కాలనీలోని ఆర్వో వాటర్ ప్లాంట్ సౌకర్యాన్ని, అంగన్‌వాడీ సెంటర్ అదానీ చికిత్సాశాలను సందర్శించారు. అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలోని ఆదాని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు వారు పరిశీలించారు ఈ పర్యటనలో అదానీ వరల్డ్ స్కూల్‌ను సందర్శించారు. వరల్డ్ స్కూల్ ప్రాధాన్యతను ప్రిన్సిపల్ సీరియల్ సత్యనారాయణ వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆదాని కృష్ణపట్నం పోర్ట్ సీఈఓ జగదీష్ పటేల్, రాజేష్ రంజన్, వేణుగోపాల్, జి.వేణుగోపాల్, కే.మృత్యుంజయ రామ్, వెంకటేష్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# గురు భక్తిని చాటుకున్న మాజీ మంత్రి కాకాణి



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** తనకు బాల్యంలో విద్యాబుద్ధులు నేర్పి, తనను తీర్చి దిద్దిన గురువు పాడె మోసిన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి తన గురుభక్తిని చాటుకున్నారు. కాకాణి హైస్కూల్ విద్యను పొదలకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అభ్యసించారు. ఆ సమయంలో సిద్దయ్య మాస్టారు ఆయనకు చదువుతోపాటు, క్రమశిక్షణ నేర్పారు. అలాగే జీవితంలో ఉపయోగపడే ఎన్నో మెళకువలను సూచించారు. ఈ నేపథ్యంలో సిద్దయ్య మాస్టారు గత బుధవారం మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే ఆయన మృతదేహాన్ని కుటుంబ సభ్యులతో కలసి సందర్శించి నివాళులర్పించారు. వృత్తిరీత్యా ఇతర దేశాల్లో ఉన్న సిద్దయ్య మాస్టారు కుమారులు రావడం ఆలస్యం కావడంతో శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల్లో పాల్గొన్న కాకాణి పాడె మోశారు. ఈ సందర్భంగా ఆయన కన్నీటి పర్యంతమయ్యారు.

# రామకృష్ణను సన్మానించిన ముస్లిం నాయకులు



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి ఏరియా వైద్యశాలకు డైరెక్టర్‌గా నిచెవల రామకృష్ణ ఎనిమిదో వార్డు చెందిన వ్యక్తి కావున 8వవార్డు ముస్లిం మైనార్టీ నాయకులు రహీం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి గృహంలో ఎమ్మెల్యే సమక్షంలో ఘనంగా సత్కరించారు. అనంతరం ఏరియా వైద్య శాల డైరెక్టర్ చవుల రామకృష్ణ మాట్లాడుతూ.. నా మీద నమ్మకం ఉంచి నాకు ఈ పదవికి సహకరించిన కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డికి అలాగే ఎనిమిదో వార్డు ముస్లిం నాయకులైన రహీం, మిగతా సభ్యులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కావలి ముస్లిం మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొని కృతజ్ఞతలు తెలిపారు.

# పెద్దబ్బీపురంలో.. ఆక్రమణలు తొలగింపు

**అనుమసముద్రం పేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేట మండలం పెద్దబీపురం గ్రామ సమీపంలో అక్రమంగా నిర్మిస్తున్న ఆక్రమణలను తహసిల్దార్ రవికుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం తొలగించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. పెద్దబిపురం గ్రామానికి వెళ్లే మార్గంలో ఆంజనేయ స్వామి గుడి వద్ద బస్సు షెల్టర్ పక్కనే పంట కాలువ పైన గ్రామానికి చెందిన డిమాల కొండయ్య ఊస తిరుపాలు అక్రమంగా నిర్మాణాలు చేపట్టారు. ఈ మేరకు ఈనెల 10వ తేదీన ఆక్రమణలు తొలగించాలని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు గ్రామస్తుల ఫిర్యాదు మేరకు అక్రమ నిర్మాణాలు చేపట్టిన ఇద్దరికీ నోటీసులు జారీ చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఏడు రోజుల సమయం ఇచ్చామని ఎలాంటి స్పందన లేకపోవడంతో శుక్రవారం తహసిల్దార్ రవికుమార్ జల వనరుల శాఖ ఏఈ పుల్లయ్య ఆర్ఐ రవి రెవెన్యూ సిబ్బంది ఆధ్వర్యంలో అక్రమ కట్టడాలను తొలగించినట్లు పేర్కొన్నారు. అలాగే ఈ మేరకు ప్రభుత్వ భూమి సూచిక బోర్డును ఏర్పాటు చేసినట్లు తహసిల్దార్ పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలాల్లో ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.

